C. Venkataramaiah
D.A.O.'s Office, S. Rly.
VIJAYAWADA.

# అన్యథా శరణం నాస్తి

## 1

ఎక్కడో యిలకోళ్ళు కూస్తున్నాయి. అది వినా అంతటా నిశ్శబ్దం తాండవిస్తున్నది. రాహులుడు (బుద్ధుని కొడుకు కాదు) ఇక చదువలేకపోయాడు. ప్రయత్నించినా మనస్సు కుదుటబడటంలేదు. రేపటికల్లా, ఉపనిషద్వ్యాఖ్యానాలు కంఠతా వల్లించాలి. ఇప్పటికే ఆలస్యమయిందని గురుపాదులు కోపగించుకొంటున్నారు. తోటివిద్యార్థులు- ఏనాడో ఉపనిషత్ప్రాకారాలను దాటిపోయారు. కొందరు మీమాంసాది శాస్త్రాలను ప్రారంభించారుకూడాను. ఇదంతా—నిజంగా తనకు అవమానమే! సహాధ్యాయులను కలుసుకోవాలని పక్షందినాలుగా తను ప్రయత్నిస్తున్నాడు. తన ప్రయత్నమెంతమాత్రం పనికిరావటంలేదు. పరధ్యానం అధికమైంది. మనస్సు విద్యమీద లగ్నంకావటంలేదు. దీనికంతా కారణం గురుపుత్రి సంధ్య. గురుపుత్రి కదా అన్న గౌరవంతో, తనామెకు చనువునిచ్చాడు. చనువు చనువుతో ఆగిపోలేదు. ననలువేసి, ఏపుగా చిగిర్చి, పుష్పించింది. ఇక ఫలించడమే గావును తరువాయి!

అనుకోవడమేగానీ ఇందుకు గురుపుత్రిగూడా కారణం కాదేమో? సంధ్య — తనతోనేగాదు — సహాధ్యాయు లందరితోనూ అతిచనువుగా ఉంటుంది. అయినా,

వారెవ్వరూ ఇలాంటివికృతికి లోనయినట్లులేదు.లోనయ్యారని అనుమానించడానికి-వారి దినచర్యలోనేమి, విద్యార్జనలోనేమి, ఎట్టిలోపమూ లేకపోవడమే సాక్ష్యం. ఎంత కాదనుకొన్నా, కన్నులు - సంధ్యసౌందర్యశరీరంవైపుకు మళ్ళుతాయి. చేతులు ఆమెను స్పృశించాలని ఆరాట పడుతుంటాయి. గ్రహచారవశాత్తూ-తన హస్తాలు దీర్ఘంగా సాగి, ఆమెను ముట్టుకోవుగదా!

సంధ్యగూడా గడుసరిదే!ఒకసారి ఏకాంతప్రదేశానికి పిలిచి, పాఠం రాలేదన్న నెపంతో చెక్కిళ్లులు పుణికింది. వ్యథాకులితం కావలసిన హృదయం ... నూతనోద్వేగం పొందింది. ఆపాదమస్తకం మధురమైన పులకరింపులు తొలకరించాయి. తేనెసోనలు వెన్నెలలతో కలిసి, శరీర మంతా ప్రవహించినట్లయింది.ఆ స్థితి తా నిదివరకు అనుభ వించినదికాదు. సరిక్రొత్తది. అనేకసారులు, అటువంటి మధురానుభవం, తిరిగి లభిస్తే బాగుండుననిపించింది. పాఠ్యాంశాలు, కంఠతా రాగూడదని తా ననేకసార్లు కోరు కున్నాడు. కారణం-మళ్ళీ అలనాటి సంధ్యాహస్త సంస్ప ర్శన, వినూత్న సంవేదన తనకు లభిస్తాయని. హాస్యంగా తాను కోరుకొన్నప్పటికీ—అది ఈ నాటికి నిజమయి ఊరు కొంది. అధ్యాపకు లేమి చెబుతున్నదీ తెలియదు. తానేమి వింటున్నదీ తెలియదు.

ఇలా ఎక్కువకాలం జరగడానికి వీలులేదు. కొద్ది రోజులలో పితృపాదులు విద్యాపరీక్షనిమిత్తం గురుదేవులు శివశర్మగారింటికి వస్తారు. ఆనాడు తానందరిలోనూ, అవ

మానపడవలసి వస్తుంది. జయభద్ర ప్రభువువారిపుత్రుడు విద్యావిహీనుడన్న 'కీర్తి' తండ్రిగారు భరించవలసివస్తుంది. నిజమే! తానిప్పుడు చేయవలసింది చాలా ఉన్నది. కానీ ఏమీ చెయ్యలేకపోతున్నాడు ఇందాకటినుండీ, ఈ వ్యాఖ్యానం చదువుతున్నాడు. ఒక్కటీ అర్థంకాలేదు. ఇది సత్యమా? కాదని అంతరాత్మ చెబుతున్నది. తను ఇందాకటినుండీ చదవడంలేదు. సంధ్యనుగురించి ఆలోచిస్తున్నాడు. గ్రంథం చేతిలోనే ఉంది. దీపం వెలుగుతూనే వుంది. మనస్సుమాత్రం సంధ్యచుట్టూ పరిభ్రమిస్తున్నది. ఇక తను చదివిందెప్పుడు? పాఠం రానిదెప్పుడు!

ఉన్నట్టుండి రాహులుడు ఉలిక్కిపడ్డాడు. తనేదో దిక్కుమాలిన కుశంకలతో అల్లకల్లోలమయిపోతున్నాడు. గురుపుత్రి వ్యాఖ్యాన వివరణకోసం రమ్మన్న విషయమే మరిచిపోయాడు. దిగ్గున లేచాడు. దీపంమలిపాడు. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ బయలుదేరాడు. గురుపుత్రి కుటీరభాగం ఉపవనంలోకి చొచ్చుకొనిఉన్నది. ఆ భాగానికి రెండుదిశలా రెండు వాతాయనము లున్నాయి. వాటినుండి చూస్తే లోపల ఎవరున్నదీ, ఏమి చేస్తున్నదీ కూడా స్పష్టంగా కనిపిస్తుంది.

ఆలస్యమయినందుకు విచారిస్తూ, సంధ్య నిద్రిస్తున్నదేమోనని రాహులుడు చూచాడు. అనుకొన్నంతా అయింది. సంధ్య నిద్రపోతున్నది. న్యాయంగా — అతను వెనుదిరిగి వెళ్ళవచ్చు. కానీ రాహులుడు అలా వెళ్ళలేదు.

తరిపి వెన్నెలలో మూగగా నిద్రిస్తున్న సంధ్య సౌందర్యం అతన్ని కట్టివేసింది. చుట్టూ చూశాడు. ప్రాణిచలనం గోచరించలేదు. ఏవో భావనలు ఉప్పెనగా లేచాయి. శరీరం—ఆనాటి సంస్పర్శకోసం రిక్కించింది. లోపలి కొచ్చాడు, సంధ్య ఉలిక్కిపడి (నట్లు) లేచింది. కళ్ళు నులుముకొని చూసింది. ఎదుట రాహులుడు .. ఓ క్షణం అతనిలోకి చూసింది. ఆవలించి వళ్ళు విరుచుకొంది. రాహులుడు విచలితుడైనాడు.

'రాహుల్' అన్నదామె నిలుచుని, 'నీ వికరావేమోననుకొన్నాను. అయినా నీ కీమధ్య భయభక్తులు బొత్తిగా సన్నగిల్లాయి. మాటలతో లాభంలేదు. చేయి చేసుకోవాలి. ఏదీ ఇలా రా!'

రాహులుడు సమీపించాడు.

సంధ్య అతని ముఖాన్ని తదేకంగా చూస్తూ, 'కదూ? చేయి చేసుకొననిదే, నీకీ విద్య పట్టుబడనట్లుంది. సరే చూస్తాను, నీ పుస్తకమేదీ?' అన్నది.

తను పుస్తకం తేలేదన్న సంగతి అప్పటికిగానీ రాహులుడు గ్రహించలేదు.

'మూఢుడా!' అన్నది సంధ్య ఫక్కుననవ్వి. 'పాఠ్య గ్రంథం లేకుండా ఏపాఠం చదవాలని నా దగ్గరకొచ్చావు? నీ అశ్రద్ధ కింతకన్న ప్రబల తార్కాణమేమికావాలి? ఇక లాభంలేదు, ఇలా దగ్గిరకు రా! నీ చెక్కిళ్ళకు రవంత కావిరంగు పట్టిస్తాను.'

రాహులుని హృదయం ఆనందంతో సొమ్మసిల్లి పోయింది.

సంధ్య రెండు బాహువులూ పైకిలేచాయి. రాహులుడు, ఆనాటి అపూర్వానుభవాన్ని తలుచుకొని కళ్ళు మూసుకొన్నాడు. సంధ్యచేతులు అతనిబుగ్గలను తాకాయి. కానీ నొక్కలేదు. ఆ స్పర్శానందాన్ని పూర్తిగా అనుభవించకముందే, ఆమె హస్తాలు మెల్లగా రాహులుని భుజాలను చవిచూచాయి. రాహులుని కివేమీ తెలియవు. అతనికి తెలిసేసరికి-సంధ్య తనను ఆలింగనంచేసుకొనివుంది. తన బాహువులు ఆమెను చుట్టివేశాయి ఆత్రంగా దేనినో వెదుకుతున్న తన పెదవులకు సంధ్య పెదవులు అడ్డొచ్చాయి. శరీరమంతా విద్యుదావేశితమయినట్లుకాగా–సంధ్యను ఇక బైట ఏమీ మిగలనంతటి గాఢంగా తనలోకి హత్తుకున్నాడు.

ఆకాశాన - జ్యోత్స్నాపంకిలంలో చిక్కుపడ్డ ఓ మేఘఖండిక విలవిలా తన్నుకొన్నది.

ఆ రాత్రి రాహులుడు నిద్రపోలేదు. మనస్సంతా, ఎటోఎటో తేలి, జలదాలనుదాటి, విశాలవిహాయస వినీల పథాల నధిగమించి, మందాకినీ సైకత స్థలాల విహరించి, స్వప్నసీమలో లీనమయినట్లు అనుభూతి పొందాడు. కొంతకాలంనుండి, ఏ అస్పష్టశక్తి తనను అలజడిపెడుతున్నదో, దానికి శాంతి లభించినట్లు గమనించాడు. కానీ నిజం కాదేమో? తాత్కాలికపు శాంతి లభించినా, ఆ అస్పష్ట శక్తి వేయిరెట్లధికంగా తనను పల్లార్చుతున్నదనటమేమో?

కళ్ళముందు అప్పుడే జరిగిన సంఘటన మెదిలింది. అదంతా యథార్థం కాదనీ, తను భ్రమపడుతున్నాననీ అనుమానించాడు. కానేకాదు. సంధ్య ఆలింగనంతో తనకు సంక్రమించిన కస్తూరికా పరిమళాలు ఇంకా పిసాళిస్తూనే ఉన్నాయి. దంతక్షతమయిన అధరోష్ఠం ఇంకా చిమచిమలాడుతూనే ఉంది. ఇవన్నీ భ్రమా జనితాలు కాగలవా?

ఆలోచించినకొద్దీ రాహులునకు తనమీద తనకే అసహ్యమేసింది. తనిటువంటి నీచకార్యం ఎందుకుచేశాడు? ఏహ్యమైన దైహికవాంఛకు ఎందుకు పాల్పడ్డాడు? ఏహ్యమైనదైనా, కాకపోయినా గురుపుత్రితోనా తన కలయిక? ఆర్య సిద్ధాంతరీత్యా, గురువుగూడా ఒకదినుసు తండ్రిలాంటివాడే! అంటే సహోదరితుల్యతో తను కాముకవ్యాపారం చేశాడు. తనెంత నీచత్వానికి ఒడిగట్టాడు! ఎంతగా పతనమయ్యాడు! భగవంతుడీ మహాపరాధానికి తననేవిధంగా శిక్షించినా శిక్షించవచ్చు. తన సంస్కారమేమయిందో, జ్ఞానమేమయిందో తెలియదు. పశువులాగా ప్రవర్తించాడు. మహాపాపాని కొడిగట్టాడు.

కానీ—ఇది నిజంగా పాపం కాదేమో! పాపమన్న భావాన్ని, తనలోని దుర్బలత్వమే తనకుకలిగిస్తున్నదేమో? నిజంగా ఆ కార్యం పాపభూయిష్ఠమే అయితే, దాని నాచరిస్తున్నప్పుడే, ఆ ఆలోచన తన కెందుకు కలుగకపోవాలి? కాకపోగా, అమేయానందం దానినుండి ఎందుకు ప్రాదుర్భవించాలి? పాపకార్యాలన్నీ ఇంత ఆనందప్రదాలైతే,

వాటిని గర్హించడంలో ఆట్టే వివేకమున్నట్లు తోచదు. ఆనందమే బ్రహ్మస్వరూపమని ప్రాజ్ఞులు ఉద్ఘాటిస్తు న్నాయి. దీనినిబట్టి—తనిపుడు పాపకార్యమని అనుకొం టున్నదిగూడా బ్రహ్మస్వరూప సంబంధి అయివుండాలి. కాని పక్షంలో 'ఆనందో బ్రహ్మ' మన్న సూత్రానికి అర్థం లేదనుకోవలసివస్తుంది. ఒకవేళ స్థాయీ భేదాన్ననుసరించి 'ఆనందం'లో వివిధతరగతులుండవచ్చు. ఏదో ఒక తరగతి వ్యక్తి అయినా ఈ 'పాపకార్యం' నుండి, ఆనంద రసాను భూతి పొందుతున్నాడంటే-అది-అతనిమేరకయినా బ్రహ్మ పదార్థం అయివుండాలి. ఆలోచిస్తుంటే తనుచేసినదానిలో దోషమేమీ ఉన్నట్లు తోచదు. పైగా వేదవిహితకార్యాన్నే తను ఆచరించాడు. ఇందుకు పశ్చాత్తాపపడవలసిన అవ సరం లేదే!

ఆలోచనతోనే తెల్లవారింది. కాల్యాదులు నిర్వర్తిం చాడు. సంధ్య ఉపహారానికి ఆహ్వానించింది. ఎందుచేతనో రాహులుడు సంధ్యకేసి చూడలేకపోయాడు. సంధ్యగూడా ఇదే స్థితిలో ఉన్నట్లు రాహులునకు తెలియదు.

అధ్యాపకు లేవో చెబుతున్నారు. విద్యార్థులు వ్రాసుకొంటున్నారు. ఏమిచెప్పిందీ రాహులునకు తెలీదు. ఏమివ్రాసుకొంటున్నదీ అంతకన్నా తెలీదు. యామాలు గడిచిపోతున్నాయి. పశ్చిమదిశ ఎర్రవారింది. చీకట్లు ఎగ బ్రాకకముందే చంద్రుడు ఎదిరించాడు. భయంతో దిశాం తాలలోకి తమస్సులు పారిపోయాయి. విజయగర్వంతో చంద్రుడు వెలిగిపోతున్నాడు. అతని కీర్తిచంద్రికలు దశ

దిశలా విస్తరిల్లాయి. సత్పురుషుని హృదయంలా, స్వచ్ఛంగా వున్న వెన్నెలలో లోకం మాటు మణిగింది. జీవులు విశ్రాంతి ననుభవిస్తున్నాయి.

రాహులుడు వీటన్నింటికీ దూరమయినాడు. అతని మనస్సు మాటుమణగలేదు. విశ్రాంతి ననుభవించనూలేదు. అర్థంకాని ఆరాట మేదో అతన్ని కకావికలు చేస్తున్నది. గురుపుత్రి అన్నభావం పశ్చాత్తాపానికి దారితీయగా, తద్విరుద్ధమైనది, ఆమె కుటీరభాగం వేపుకు లాగుతున్నది. ఈ అంతస్సంఘర్షణతో రాహులుడు అలసిపోయ్యాడు. నిద్రకు జాగ్రదవస్థకూమధ్య చిక్కుబడిపోయ్యాడు. ఆ అవస్థాభంగం జరిగినప్పుడు, ఎంతరాత్రయిఉంటుందో అతనికి తెలియదు. ఉన్నట్టుండి అతని నరాలు జాలిగా మూలిగాయి. నెత్తురు కొత్త విస్తీర్ణాలను వెదుక్కుంటూ ప్రవహించింది. తలలో ప్రచండతేజం విరిసినట్లయింది. శరీరమంతా మధుసేచన మయినట్లు కాగా, ప్రయత్నపూర్వకంగా కన్నులు తెరిచాడు. సంధ్య పెదవులు తనను చుంబిస్తున్నాయి. ఆమె వక్షోజాలు తనలోనికి నిప్పుచినుకులు వర్షిస్తున్నాయి. రాహులుడు రెండుచేతులూ, సంధ్యతలలోకి జొనిపాడు. ఆమె ఆడపులిలా బుసలుకొడుతున్నది.

"సంధ్యా!" అన్నాడు రాహులుడు చెవిలో.

సంధ్య పలకలేదు. మూసిన కళ్ళు విప్పలేదు. కాక పోగా, అతన్ని తనమీదికి తీసికొని గాఢంగా హత్తుకొంది.

# 2

కారణ మేమిటో తెలీదుగానీ, జయభద్రుడు విద్యా పరీక్ష జరుపలేదు. అనుశ్రుతంగా వస్తున్న ఈ ఆచారానికి భంగంవాటిల్లడాన్ని అమాత్యాదులు హర్షించలేక పోయారు. యెందుకని వారడగనూలేదు. జయభద్రుడు చెప్పనూలేదు. ఈ అలజడి సమసిపోకముందే రాహులుని విద్యాసమాప్తి గూడా జరిగింది. ఆకస్మికంగా వచ్చిపడు తున్న ఇట్టి పరిణామాలకు కారణం యోచించలేక, మహా రాణి సుపర్ణాదేవి చికాకుపడుతున్నది. చెలికత్తెలను పంపి కారణాన్ని తెలిసికొని రమ్మన్నది. వారు వెళ్ళారు. తిరిగి వచ్చారు. సమస్య సమస్యగానే ఉండిపోయింది. ఇక విధిలేక భర్తనే పృచ్ఛించింది. సమాధానం సంతృప్తి నివ్వకపోగా, ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇటువంటి జవాబు వినవలసివస్తుందని మహారాణి ఊహించనైనా ఊహించ లేదు.

"అనవసరమా?" అన్నది సుపర్ణాదేవి. "ఇది మన వంశాచారంకాదని ప్రభువులకు తెలుసు. విద్యాపరిపూర్ణత లేనిదే, పాలనార్హత రాదన్న కారణంతోనే, పూర్వులీ నిర్ణయాన్ని చేశారని, మీరే ఎన్నోసార్లు అన్నారు."

"నిజమే! కానీ భూమికి, ఆకాశానికి అంతమంటూ లేనట్లే, విద్యకుగూడా లేదు. ఎంత తెలుసుకున్నా, ఇంకా తెలుసుకొనవలసింది అనంతంగా మిగిలిపోతుంటుంది.

విద్యకు పరిసమాప్తమంటూ లేదు. అయినప్పుడు ఇప్పుడు విరమించినా విరమించవచ్చు" అన్నాడు జయభద్రుడు.

సుపర్ణ మాట్లాడ లేదు.

"పూర్వులేవో నిర్ణయాలు చేశారని, అంధంగా వాటినే అనుసరించ లేము. నిర్ణయాలనుబట్టి స్థితిగతులు మారవు. వాటి ననుసరించే నిర్ణయాలు మారుతుండాలి." అన్నాడు జయభద్రుడు. "అదీగాక-రాహులుడు బాల్యాన్ని దిగవిడిచాడు. యౌవనా న్నధిరోహించాడు. ఇంతవరకూ విద్యాలోకంలో సంచరించాడు. అబ్బవలసిన దేదో అబ్బింది. ఇకనైనా లౌకిక జగత్తుతో పరిచయంచేసుకోవడం ఉత్తమం. మరొక పది సంవత్సరాలు గురుకులవాసం చేసినతరువాతనయినా, ఇది తప్పదు. అయినప్పుడు అంత కాలాన్ని విద్యార్జనలో వినియోగించడం అనవసరమే! అదీ గాక_రాహులుడు, పండిత చర్చల్లో పాల్గొనబోవడం లేదుగదా! మరెందు కీ లేనిపోని బెడద?"

మహారాణి ప్రత్యుత్తరమివ్వలేదు.

* * * *

రాహులుని గురుకులావాసం రేపటితో పూర్తి అవుతుంది. అతని కే కోశానా సంతోషంలేదు. ఇటువంటి పరిస్థితి రాగలదని రాహులుడు ఊహించలేదు. విద్యార్జన పోతున్నదన్న బెంగ- అతని కిప్పుడులేదు. ఉండి చదువుతున్నది మాత్రం ఏమున్నది గనుక! కానీ, సంధ్యకు దూరమవుతున్నాడు. జీవితానికి పరమార్థాన్ని బోధించిన

సంధ్యను- ఇకనుండి కలసి కొనడానికి వీలుండదు. ఈబాధే రాహులుని కకావికలు చేస్తున్నది. తుత్తునియలు చేస్తున్నది.

సంస్థానంనుండి అమూల్యాలైన కానుకలు వచ్చాయి. రాహులుడు సహాధ్యాయు లందరికీ పంచాడు. చీని చీనాంబరాలతో నిండిన బంగారు పళ్ళెరాన్ని శివశర్మ పాదసన్నిధి నుంచాడు.

"ఇష్టార్థ సిద్ధిరస్తు"

రాహులుడు చిరునవ్వు నవ్వాడు.

"మీ ఆశీర్వాదం యథార్థ మవ్వాలని కోరు తున్నాను. సిద్ధ పురుషులు. వట్టిపోగూడదు మరి!"

ఒకే ఒక్క-రాత్రి, ఇక తను సంధ్యను కలుసుకొన డానికి మిగిలిఉన్నది. ఇది తప్పితే ఎప్పటికో తను తిరిగి సంధ్యను చూడటం! తను రాజ్యాధికారానికి వచ్చి, సంధ్యను మహారాణిని చేసినప్పటి మాట. రాహులునకు ఉప్పెనగా దిగులు వేసింది. తనలోనుండి ఏదో జారిపోతు న్నట్లు గిలగిలలాడాడు మనస్సు చిరాకెత్తిపోయింది. స్థిమి తంగా కూర్చొనలేకపోయాడు. ధరాలున లేచి సంధ్య కుటీరంవేపు సాగారాడు. అంధతమస్సు లావురావురు మంటున్నాయి. చుక్కలు భయంతో మినుకు మినుకు మంటున్నాయి. బాహ్య ప్రకృతిలాగానే సంధ్యా కుటీరం గూడా భయావహంగా ఉన్నది. రాహులుడు తలుపు నెట్టాడు. చీకటి- మూఢ చిత్తంలాంటి చీకటి, అంతటా వెల్లివిరిసింది.

"సంధ్యా!"

ప్రత్యుత్తరానికి బదులు వెక్కిళ్ళు వినిపించాయి, తడుముకొంటూ శయ్యను సమీపించాడు. సంధ్య ముడుచుకొని పడుకొన్నది. వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

"సంధ్యా!"

అన్నాడు రాహులుడు రెండు చేతులతోనూ ఆమెను పొదివిపట్టుకొని. సంధ్య దుఃఖాన్ని ఆపుకొనలేకపోయింది. రెండు చేతులూ రాహులుని కంఠానికి చుట్టి, బావురుమని ఏడ్చింది. కన్నీరు రాహులుని జిహ్వకు ఉప్పగా తగిలింది.

"పిచ్చిదానా! విచారమెందుకు? ఇందువల్ల ఎవరుగానీ, నష్టపడవలసిన దేమీ లేదే! తాత్కాలికంగా, ఎడబాటు సంభవించిన మాట నిజమే! కానీ, ఒకటి మాత్రం జ్ఞాపకముంచుకో. ఇది కేవలం తాత్కాలికం మాత్రమే! కొద్ది రోజులలోనే మన వివాహం ఏర్పాటవుతుంది. మీ తండ్రిగారు ఆశీర్వదించారు గూడాను. వారి మాటలు కల్లకాలేదు. కాబోదు. మన ఈ పరిచయం మీ తండ్రిగారికి తెలుసుననీ, తెలిసినా మౌనంవహించారనీ నువ్వంటున్నావు. ఇక మన వివాహానికి వారి ఆమోదముద్ర సులభంగా లభిస్తుంది ... నావిషయం బెంగపెట్టుకోకు. నేను కానున్న రాజును. నా మాటను కాదనటమన్న ప్రశ్నే లేదు."

సంధ్య ఊరడిల్లింది.

తొలి కోడి కూసింది.

## 3

రాహులుడు అబద్ధమాడలేదు. తను అన్నమాటను నిలబెట్టుకొనగలనన్న నమ్మకం అతని కున్నది. ఆ మాత్రం ఆత్మవిశ్వాసం లేకపోయినట్లయితే, సంధ్యతో ఆవిధంగా చెప్పివుండేవాడు కాదు. తల్లి దండ్రులను ఒప్పించగల నన్న ధైర్యం అతనికి పుష్కలంగా వున్నది. ఇక కావలసిం దల్లా, తన మనస్సు విప్పి చెప్పడానికి అనువయిన సమయం. వారంగీకరిస్తే తన వివాహం నిర్విఘ్నంగా జరుగుతుందనడంలో సందేహించవలసిందేమీ లేదు. సంధ్య మాటలను బట్టి - శివశర్మ కేమీ అభ్యంతరం లేదని తేలుతున్నది. భర్తృమార్గగామి యైన శుక్తిమతిగూడా విధిగా అంగీకరిస్తుంది. ఇక కావలసినదల్లా...

రాహులుని ఊహ కొంతవరకే నిజం! అత ననుకొంటున్నట్లు శివశర్మ కెట్టి అభ్యంతరమూ లేదు. ఒక రాజాధిరాజుతో వియ్యమందడమన్న అదృష్టం - సామాన్యులకు లభించదు. దానికెంతో పెట్టిపుట్టివుండాలి. ఎంతో పూర్వజన్మ సుకృతం కావాలి.

మొట్టమొదట, విద్యార్థు లీ విషయం రహస్యంగా చెప్పినప్పుడు శివశర్మ నమ్మలేదు. గురుపుత్రికతో కలయికకు సిద్ధపడేటంత "నీచుడు" రాహులుడు కాదనుకొన్నాడు. విద్యార్థుల్లో సహజంగా ఉండే ఈర్ష్యాసూయల వల్లనే, వా రిట్లా చెప్పివుంటారని తాను సంతృప్తిపడ్డాడు.

అయినా అనుమానం మనస్సును వేధిస్తూనే ఉంది. దానికి తోడు సంధ్యా రాహులుల ముసిముసి నవ్వులు, క్రీగంటి చూపులు, అతని అనుమానాన్ని బలపరిచాయి. ఒకటి రెండు రాత్రులు వారిని పరీక్షించాడు. నిజమే! విద్యార్థులు అబద్ధం చెప్పలేదు. ఈ విషయం శక్తిమతితో చెప్పి కూతురును మందలించమందా మనుకొన్నాడు. కానీ చెప్ప లేకపోయాడు. కూతురి "ప్రయణ" జీవితాన్ని భార్యతో చెప్పడానికి అతనిలోని పితృ హృదయం తటపటాయిం చింది. కూతురుమీద విపరీతమైన అసహ్యమేసింది. ఇటు వంటి నీచురాలు ప్రాణాలతో ఉండరా దనుకొన్నాడు. ఈ విషయం భార్యతో చెప్పనందుకు సంతోషించాడు. చెప్పినట్లయితే - శక్తిమతి సుతరామూ యిందు కొప్పు కొనేదికాదు. సంధ్య నిర్దోషినని వాదించేది. దానిని కంటిని రెప్పలాగా కాపాడుతుండేది. అప్పుడు సంధ్యను కడతేర్చ టం—ఇప్పుడున్నంత సులభంగా ఉండకపోవచ్చు. నలుగు రికీ తెలిసి, తలవంపులు రాకముందే, ఈ దుష్టాంగాన్ని తను ఖండించివేస్తున్నాడు. శేషాంగం యిక సుఖంగా ఉండగలదు.

ఈ అభిప్రాయంతోనే, నాటిరాత్రి నిద్రపోకుండా కూచున్నాడు. ప్రొద్దుపోయిన తరువాత, ఒక్కడే వెళ్ళి, సంధ్యను కడతేర్చి, గుట్టుచప్పుడు కాకుండా నిద్రపోతాడు. సంధ్య హత్యచేయబడ్డదన్న విషయం తెల్లవారిగానీ, బయటపడదు. అప్పుడెటుగూడీ గగ్గోలు జరుగుతుంది. అంద రితోబాటు తానూ దుఃఖిస్తాడు. విచారణ జరగకపోవచ్చు.

జరిగినా నిజం బయటపడటం అసంభవమే! రాజభటులు-ఒక వేళ కూపీలు తీసినా, తనను అనుమానించటానికి అవకాశమే లేదు. పోతే మిగిలిఉన్నది విద్యార్థులు. అంతదాక వచ్చినప్పుడు వారు మాత్రం నిజం చెప్పకపోరుగదా! సంధ్యకు రాజపుత్రునకు గల సంబంధం అప్పుడే వెల్లడవుతుంది. గురుపుత్రితో సంయోగానికి వెనుదీయని నీచుడు, ఆమెను హత్య చేయటానికిగూడా వెనుదీయడన్నది లోకానికి తెలియదా? నేరస్థుడు రాహులుడే అవుతాడు. ప్రభువు అతన్ని శిక్షిస్తాడా? దుష్ట శిక్షణమయిన ఫలితం లభిస్తుంది. శిక్షించడా? అతని పక్షపాత బుద్ధి లోకానికి వెల్లడవుతుంది. ఏవిధంగా చూసినా, తనకు కలిగేది. లాభమేగానీ, నష్టం కాదు, కాబోదు.

ఈ ఆలోచనలతోనే, శివశర్మ కూతురు కుటీరాన్ని సమీపించాడు. లోపల సంధ్య ఒంటరిగాలేదు. రాహులుడు ప్రక్కనేఉన్నాడు. సంధ్య అతని జుట్టులోకి వ్రేళ్ళుపోనిచ్చి గోముగా దువ్వుతున్నది. రాహులుడు, సంధ్య చెక్కిళులు పుణుకుతున్నాడు. శివశర్మ ఆగ్రహంతో భగ్గుమన్నాడు. ఒక్కపెట్టున దూకి నరికిపారేయాలనుకొన్నాడు. పండితుడు గనుక వేగిరపడలేదు. తొందరపడి కార్యవిఘ్నమొనర్చుకొనడం వివేకవంతుల లక్షణం కాదుకదా! మరొక్క-జాము సేపటికైనా రాహులుడు వెళ్ళక తప్పదు. అప్పుడు-ఒంటరిగాఉన్న సంధ్యను....

"రాహుల్" అన్నది సంధ్య. "నీ మాటల మీద నాకు విశ్వాసం కలగటంలేదు. ఇప్పుడు గాకపోయినా,

మరొకనాటికయినా, మనం విడిపోకతప్పదనే నా ఆత్మ చెబుతున్నది. కలకాలం కలిసి ఉండటం ఎట్లా సంభవమో, నేను ఊహించలేకుండా ఉన్నాను. ఈ కాలవాహిని ప్రవహించకుండా ఇలానే ఆగిపోగూడదూ? ఈ లేత వెన్నెల, చిఱుశీతువు, ఒంటరితనం, ఇలానే నువ్వు నాప్రక్కన, నాలోకి ఆనంద ఝరులు ప్రవహింపచేస్తూ...ఇలా...ఇలాగే ఈ ప్రపంచం వున్నంతకాలమూ.. స్థిరంగా ఉండిపోయే ఏర్పాటు లుండగూడదూ!"

శివశర్మ పండ్లు పటపటలాడించాడు.

"ఉండవచ్చు. ఉంటాయి గూడాను." అన్నాడు రాహులుడు. "కానీ సంధ్యా! నువ్వింకా నన్ను విశ్వసించటం లేదు. మనకు ఎడబాటురాదు. చిరకాలం యిలాగే ఉండిపోతాము. ఆశ్చర్యపడకు. నిన్ను నా పట్టమహిషిగా చేసుకొంటాను. ఈ నిశ్చయం యేనాడో జరిగిపోయింది. నమ్మవా? నన్ను చీల్చిచూడు. నాప్రతి రక్తకణంలోనూ, నీ కీ నిర్ణయం గోచరిస్తుంది. సంధ్యా! ఇప్పటి నాకు, తల్లిదండ్రులకన్నా, విశాల సామ్రాజ్యంకన్నా, నువ్వే అధికురాలవు. అందుకే నీమీద ఒట్టుబెట్టుకొని చెబుతున్నాను. నిన్ను నా పట్టపుదేవిగా చేసుకొంటాను. నీ సౌందర్యాన్ని సహస్రహస్తాలతో పూజిస్తూ, జీవితాన్ని సుఖమయం చేసుకొంటాను..."

ఒక్క గాఢాలింగనం.

చుంబనధ్వని.

రాహులుని ప్రతిజ్ఞతో శివశర్మహృదయం ఃహూర సాగింది. తను అనుచితంగా సంధ్యను తుదముట్టించాలను కొంటున్నాడేమో? కొన్ని క్షణాలు తీవ్రంగా ఆలోచిం చాడు. మెరపులాంటి భావం స్ఫురించింది. సంతోషంతో అంగలేసుకొంటూ వచ్చి, తన పడకమీద మేనువాల్చాడు. ఆలోచనలు కట్టలు తెగి ప్రవహిస్తున్నాయి. తను తొందర పడి సంధ్యను హత్యచేయకపోవడమే మేలయింది. చేసిన ట్లయితే, ఎన్నో అనర్థాలు దాపురించేవి. ఏది ఏమయినప్ప టికి రాహులుడు రాచబిడ్డ. ఆడితప్పడు. అందునా సంధ్యపై మమకారంతో కొట్టుమిట్టాడుతున్నాడు. మీదుమిక్కిలి పట్టినపట్టు విడువనితత్వం ఆజన్మసిద్ధంగా సిద్ధించింది. ఎవరుకాదన్నా, రాహులుడు విధిగా సంధ్యను వివాహం చేసుకొంటాడు. ఇది తనేకాదు; హరిహరాదులుగూడా మాన్పలేరు. అయినప్పుడు—భావిసామ్రాజ్ఞిని తను కడ తేర్చటమా? కడతేర్చి, కన్నబిడ్డ భవిష్యత్తును తనే చేజే తులా ధ్వంసంచెయ్యడమా? ఇది కన్నతండ్రి చేయవలసిన పనిగాదు. సరికదా, కటికవాడుగూడా చేయరానిది.

తనేదో భ్రమించాడు గానీ-ఇందులో తప్పు పట్ట వలసిందేమీలేదే! సంధ్యారాహులులు పరస్పరం ప్రేమించు కొన్నారు. పెండ్లిచేసుకొందా మనుకొన్నారు. ఇది తప్పు కాదే! తప్పేఅయినపక్షాన, గిరిజ శంకరుని పెండ్లాడటం గూడా తప్పేకావాలి. శంకరుడు పరమబికారి. కాగా గిరిజ —హిమశైల రాజపుత్రి. వర్ణవిభేదాలు — ఆలోచన

నీయాలేకావు. కారణం: వారిరువురనూ బంధిస్తున్నది సామాజికసూత్రంకాక, ప్రేమసూత్రం కావటం.

అదీకాక—ఎంతకాలం ఈ అధ్యాపక జీవితాన్ని కొనసాగించటం? దీనికి అంతమెప్పుడు? తనిప్పుడు పడుతున్న కష్టాలేమీ లేవు. జయభద్రప్రభువు సకలసౌఖ్యాలు సమకూరుస్తున్నాడు. అయినా ఇంతకన్నా ఎక్కువసుఖాలను అపేక్షించటం తప్పుకాదు. భగవంతునిదయవల్ల ఈ వివాహమేజరిగితే, తన జీవితచరిత్రలో స్వర్ణాధ్యాయం ప్రారంభమవుతుంది. సంధ్యాసౌందర్యలోలుడై రాహులుడు రాచకార్యాలను ఒకకంటనైనా చూడగలడనుకోవడం వెర్రితనమవుతుంది. నామకః రాజ్యపాలకుడు రాహులుడైనా, ప్రధానపాత్ర-ముఖ్యపాత్రగూడానేమో-తనే వహించవలసివస్తుంది. మరొకమాటలో చెప్పాలంటే, రాజ్యం తన చెప్పుచేతలలో వుంటుంది. పాలనాయంత్రం తన కన్నుసన్నలలో మెలగుతుంటుంది. ఇంతకన్న తను వాంఛించవలసిందేమీ లేదు. సంధ్యారాహులుల వివాహంవల్ల, తన సంస్కారహృదయం లోకానికి వెల్లడికావడమేగాక, రాజ్యంగూడా హస్తగతమవుతుంది. కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత, ఎప్పుడో ఒకప్పుడు రాహులుడు (బలవంతంగానైనా) మరణించవచ్చు. రాజ్యాధికారం తనకు-పోనీ తన దౌహిత్రుడికు లభిస్తుంది. ఇంతటి మహత్తరమైన భవిష్యత్తును-కాలదన్నటం అర్థంలేనిపని. అవివేక కార్యం.

# 4

తన ఆలోచనలన్నీ శివశర్మ భార్యకు చెప్పలేదు. చెప్పక సంధ్యావివాహంమాత్రమే ప్రస్తావించాడు.

శక్తిమతి ఫక్కున నవ్వింది.

"ఈ విషయమై మీరు నన్నుముందుగా అడగాలా? మీరు అమాయికులు కారుగదా? సంధ్య కష్టపడాలని మీ రేపనీ చెయ్యరు. మీ యిష్టం. సంధ్యయిష్టం. మీమాటను నే నిదివరకూ కాదనలేదు: ఇప్పుడూ అనను. యోగ్యుడైన అల్లునికోసం నా మనస్సుగూడా తహతహలాడు తున్నది."

శివశర్మ ఏదో చెప్పబోయి అంతలోనే ఆగిపో యాడు.

*　　　*　　　*

రాహులుని స్వయంవర ప్రయత్నాలు ప్రారంభించ మని జయభద్రుడు ముఖ్యమంత్రిని ఆజ్ఞాపించిన నాటిరాత్రి, సుపర్ణాదేవి భర్తతో కుమారుని విషయం ప్రస్తావించింది.

"అంటే, రాహులుడు ఆజన్మ బ్రహ్మచారిగా అలా ఉండిపోతాడా?" అన్నాడు జయభద్రుడు.

"మీ పుత్రుడా బ్రహ్మచారిగా వుండటం ?" అని హాస్యమాడింది సుపర్ణ. "కాదు ప్రభూ! మీరు స్వయంవర ప్రయత్నాలు విరమించండి."

"నాకు బోధపడటం లేదు."

"అంత కఠినమైన దేమీ కాదు ప్రభూ !" అన్నది సుపర్ణ కొన్నిక్షణాలాగి. "రాహులుడు మన కోడలెవరో నిర్ణయించాడు. నిర్ణయించానని మీతో చెప్పడానికి భయ పడుతున్నాడు."

"ఎందుకు? గాంధర్వ వివాహాలు రాజవంశీయులకు పరిపాటి అయినవే! మంచిది. రేపే ప్రయత్నాలనవసరమని మంత్రితో చెబుతాను. రాహులుడు మా శ్రమ చాలా తగ్గించాడు... వధువెవరో నీకు తెలుసా?"

"ఆఁ. సంధ్య!"

"సంధ్యా!"

మ్రాన్పడిపోయాడు జయభద్రుడు.

"అవును ప్రభూ! ఆస్థానాధ్యాపకులు శివశర్మగారి పుత్రిక... అదేమిటి ? ఎందుకలా ఆశ్చర్యపోతున్నారు ?" అన్నది సుపర్ణ.

"ఆఁ.... నేనా... ఏమీలేదు" అని సంబాళించు కొన్నాడు జయభద్రుడు. "లాభంలేదు. ఈ సంబంధాన్ని నే నంగీకరించను... నీచుడు ... అదేమిటి సుపర్ణా! గురు పుత్రుని వాంఛించటమా! దీనికి లోక మేమంటుంది? సాటి రాజు లేమంటారు?"

"ఎవ రేమన్నా-ఇప్పుడు మనం చేయగలిగిం దేమీ లేదు." అన్నది రాణి.

"పొరబాటుపడుతున్నావు. పూర్తిగా మునగక ముందే మేలుకొన్నాం. ఇక జరగవలసినదంతా ముందే వున్నది." అన్నాడు జయభద్రుడు.

"ప్రభూ!" అన్నది ఓ క్షణమాగి సుపర్ణ. "రాహులుడు గాంధర్వవిధిగా సంధ్యను పెళ్ళాడాడు. వారిద్దరూ కొంతకాలం దాంపత్యధర్మాన్ని నిర్వహించారట. అదీగాక సంధ్య ప్రస్తుతం గర్భవతి. ఇప్పుడు చెప్పండి మీ రేం చేస్తారు?"

"ఏమైనా చేస్తాను" అన్నాడు జయభద్రుడు అగ్గిలా మండిపోతూ. "రాహులుణ్ని ఉరిదీయిస్తాను. శివశర్మను దేశబహిష్కృతుణ్ని చేస్తాను. నాకు బిడ్డలే లేరనుకుంటాను, వున్నా చచ్చిపోయా రనుకొంటాను."

"ఇంత దారుణం జరిపించటానికి, రాహులుడు చేసిన అపరాధ మేమిటి ప్రభూ? సంధ్యను ప్రేమించటమా? ఆమెను వివాహమాడటమా? గాంధర్వవివాహాలు రాజుల కున్నాయని మీ రే అంటున్నారు. ఇక గురుపుత్రిఅంటారా? ఆ విషయమై నేనూ అడిగాను: నిజంగా పాపకార్యమే ఐతే, ఆ తప్పు భగవంతునిదేనన్నాడు రాహులుడు. భగవన్నిర్మితమైన ఈ శరీరం, ఒక పాపకార్యాన్ని చేసిందంటే, ఆ లోపం నిర్మించినవాని దేతప్పవుతుం దెట్లా అవుతుందని వాడు నన్ను ప్రశ్నించాడు. నే నే సమాధానమూ చెప్పలేకపోయాను. మీరు చెప్పగలిగితే, పిలిపిస్తాను. వచ్చ చెప్పండి. అంతేగానీ ఉరితీతలు, దేశబహిష్కృతాలు ఎందుకు ప్రభూ?" అన్నది మహారాణి.

ఎందుకో మహారాజు చెప్పలేదు. కానీ అక్కడి నుండిమాత్రం చకచకా వెళ్ళిపోయాడు.

# 5

సంధ్యతోటి తన వివాహాన్ని అంగీకరించలేదని రాహులునకు తెలిసినప్పటినుండీ, అతగాడు చలిపిడుగై నాడు. రహస్యంగా ముఖ్యమంత్రినీ సైన్యాధికారులనూ, పిలిపించాడు. వారితో మంతనాలాడాడు.

"నేను రాజపుత్రుణ్ని. న్యాయంగా ఈ రాజ్యానికి వారసుణ్ని. కానున్న చక్రవర్తిని. జయభద్రుడేగాదు, అతని న్యాయసూత్రాలు, కఠోరాజ్ఞలు నన్నేమీ చేయలేవు. నా నిర్ణయాన్నుండి మరలించలేవు. ఏది ఏమైనప్పటికీ నా వివాహం సంధ్యతో జరుగవలసిందే! బూజుపట్టిన నీతిసూత్రాలకోసం, సంధ్యను నేను వదులుకోలేను. మహామంత్రీ! ప్రభువువారు నాతో పగపెట్టుకోవడం క్షేమం కాదు. అందుకు మీరు సహాయపడటమూ క్షేమంకాదు. మరొకసారి జ్ఞప్తికి తెస్తున్నాను. నేను కానున్న పాలకుణ్ని. మీ అధికారాలు, పదవులు, నా అధీనంలో కొస్తాయని మీరు మరచిపోకండి. ఏమో చెప్పలేను... ప్రభువుకూ, నాకు పోరు సంభవించవచ్చు. నేను మీ సహాయాన్నర్థిస్తున్నాను. విశేషాధికారాలు మీకు సంక్రమించేలాగున పరిపాలనాచట్టాన్ని సవరిస్తాను. మీ అభిప్రాయమేమిటి?" అని ప్రశ్నించాడు రాహులుడు.

సేనాపతులు ఒకరిమొఖం మరొకరుచూచుకున్నారు.

మంత్రిని నిశ్శబ్దంగా ప్రశ్నించారు. ఏవో సైగలు చేసుకొన్నారు. ఏకగ్రీవంగా తమసహాయం లభిస్తుందని చెప్పారు.

ఆనాటినుండీ రాజోద్యోగులలో రవరవలు ప్రారంభమైనాయి. రాహులునిపక్షానికి విశేషబలసంపదలు చేరగా, కొద్దిమంది సైనికులు, రాజభటులు జయభద్రునిపక్షాన చేరారు. ఇది రహస్యమేమీ కాదు. బహిరంగంగానే జరిగింది. మహారాజు ఇదంతా గమనిస్తూనేవున్నాడు. కిమ్మనలేదు. సభలు యథాతథంగా జరుగుతూనే వున్నాయి. పరిపాలన సక్రమంగా సాగుతూనేవుంది. ఇరుపక్షాలు మొగ్గదీసి వున్నాయి. ఏ క్షణంలో కల్లోలం జరిగినా జరగవచ్చు. తండ్రీ కొడుకులలో ఎప్పుడు ఎవరు ఏ అపాయానికి గురికావలసివచ్చినా రావచ్చు. ఇంత జరిగినప్పటికీ, రాహులుడు తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. జయభద్రుడు తన పట్టుదలను సడలించనూ లేదు.

*　　*　　*

ఈ వార్తలన్నీ సంధ్యను చిరాకుపరచాయి. తన వివాహసమస్య ఇంతటి తీవ్రస్థితికి వస్తుందని సంధ్య కలలో గూడా అనుకోలేదు. నిర్విరోధంగా వివాహమవుతుందనీ, సుఖడోలికలలో ... అదీ సంధ్య స్వప్నం. ఆ స్వప్నం ముక్కలుముక్కలయింది. దానిస్థానంలో పీడకలలు పారాడుతున్నాయి.

రాహులునితండ్రి వారిస్తున్నట్లే-తనను తల్లి వారిస్తున్నది. ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డదిగానీ, ఈ వివాహాని కంగీకరించలేదు. తండ్రి నయాన భయాన చెప్పి చూశాడు. ఎంతగానో ఎన్నెన్నో బోధించాడు. తల్లి వినలేదు. క్రూరంగా హింసించాడు. అన్నపానీయాలు లేకుండా బాధించాడు. శుక్తిమతి అన్నింటినీ ఓర్పుతో భరించింది. ఇలా హింసిస్తున్నందుకు విచారించలేదు. ప్రాణాలుతీసినా సరేనన్నది. కూతురునుమాత్రం రాహులుని కివ్వనన్నది.

"ఎందుచేత!" అని ప్రశ్నించుకొన్నది సంధ్య.

సమాధానం స్ఫురించలేదు. తల్లి చెప్పిన జవాబులు ఎవరికైనా హాస్యాస్పదంగా తోచకమానవు. మరి నిష్కారణంగా, తల్లి అలా అంటుందా? తను సౌఖ్యపడటం ఆమెగారి కిష్టంలేదా? లేక తనమీద తల్లి కక్షతీర్చుకొంటున్నదా? వీటికేమీ ఆధారాలు లేవు. కలలోగూడా__ తనంటే తల్లి కిష్టంలేదని, సంధ్య అనుకోలేదు. చిత్రమేమిటంటే, వ్యతిరేకిస్తాడనుకొన్నతండ్రి ఆనందంతో అంగీకరించాడు. అంగీకరిస్తుందనుకొన్న తల్లి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఈ వైరుధ్యాలకేదో ప్రబలమైన కారణమే ఉండి ఉంటుంది. అలాగే రాహులుని విషయం కూడానూ. స్వల్పభేదంతో తా మిరువురూ ఒకేవిధంగా వున్నారు. అక్కడ తండ్రి కాగా, ఇక్కడ తల్లి. అక్కడ మహారాజూ, ఇక్కడ తల్లిగూడా అసహాయస్థితిలోనే ఉన్నారు. కానీ వీరి ప్రభావంమాత్రం త్రోసిపారేయవలసిందికాదు.

కుమారుని వివాహ కారణంతో, రాజ్యం అల్లకల్లోల మవడాన్ని సుపర్ణాదేవి ఎంతమాత్రం సహించలేకపోతున్నది. అనేకవిధాల ఇద్దరికీ చెప్పి చూసింది. ఎవరి కారణాలు వారివద్ద సిద్ధంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ తమ నిర్ణయాలు ధర్మబద్ధమైనవనే వాదించారు. నిరూపించారు.

అయితే ఇక జరగవలసిందేమిటి? తండ్రీ కొడుకుల యుద్ధమా? అది వీలుకాదు. తనకు యిద్దరూ ఆత్మీయులే! యిద్దరూ కావలసినవారే! ఏ ఒక్కరు లేకపోయినా తన జీవితానికి సంపూర్ణత్వం ఉండదు. సమగ్రత్వం కొరవడుతుంది. భర్తపక్షంవహించి, కన్నకడుపుకు అగ్గి ముట్టించుకొనలేదు. కొడుకువైపుచేరి, భర్తను తృణీకరించలేదు. తను చేయవలసిందేమిటి? ఈ విషవ్యూహాన్నెలా పరిహరించాలి?

అదృష్టవశాత్తూ ఆమె మనోవీథిలో ఉపగుప్తుడు (యితడు బౌద్ధ పరివ్రాజకుడు కాదు) మెరిశాడు. అతడు మహాపండితుడే కాక, ప్రభువువారికి పూజనీయుడు గూడా. ఉపగుప్తుని సూచనమేరకే, రాహులుని విద్యాభ్యాసం శివశర్మ సాన్నిధ్యంలో సాగింది. వారి సూచనల పర్యవసానం ఇలా పరిణమించింది. దీనికి వారేమి చెబుతారో చూడవలసి ఉన్నది. లోకవంద్యులు గనుక, ఉపగుప్తుల నిర్ణయాన్ని యిరువురూ శిరసావహించవచ్చు. ఒకవేళ, యావనోద్రేకంలో — రాహులు డంగీకరించకపోయినా, ప్రభువువారు తప్పకుండా ఒప్పుకొంటారు.

ఈ అభిప్రాయంతోనే సుపర్ణాదేవి, చేటిచేతి కొక లేఖనిచ్చి, ఉపగుప్తుని సాన్నిధ్యానికి పంపించింది.

## 6

"స్వామీ! అన్నాడు రాహులుడు. 'మీరు మహా పండితులు. తపస్సంపన్నులు. మీకు తెలియని నీతి సూత్రాలుగానీ, ధర్మములుగానీ ఉండవు. జరిగిన సంగతులన్నీ తల్లిగారు మీకు సాకల్యంగా వివరించారు. ఇక నేను చెప్ప వలసిందేమీ లేదనుకొంటాను. మీ సలహా యేమిటి? సంధ్యను వివాహమాడటం దోషమంటారా?"

"వత్సా! కాదా మరి?" అన్నాడు ఉపగుప్తుడు.

రాహులుని కనుబొమలు ముడివడ్డాయి.

"వివరించగలరా?"

ఉపగుప్తుడు ఫక్కున నవ్వాడు. నవ్వి—

"నాయనా, మూఢునిలా నువ్వు ప్రశ్నిస్తే నేను జవాబు చెప్పలేను. పితృ పంచకంలో గురువు మూడవ వాడని నీకు తెలియదా? పితృవ్యతనూజ భగిని కాగలదు కానీ, భార్య కాగలదా? ఈస్వల్ప విషయంసైతం తెలియ నంతటి అమాయకుడవని నేను అనుకోను. సోదరీ సంయోగ భావం ధర్మసమ్మతమని నీఅంతరాత్మ చెబితే నేను కాద నను." అన్నాడు ఉపగుప్తుడు.

"స్వామీ! పరిస్థితులు ఎంత తీవ్రదశకు వచ్చాయో తమకు తెలుసు. ఇందుకు కారణం, సంధ్యా వివాహ నిర్ణ

యాన్ని మార్చుకోనలేకపోతున్నానంటే, దాని వెనుక నున్న, నా అంతరాత్మ ప్రోద్బలం యెంత బలీయంగా ఉన్నదో మీరు గ్రహించలేరా? కాదు, మీకు తెలుసు. అయినా తెలియనట్లు నన్ను ప్రశ్నిస్తున్నారు" అన్నాడు రాహులుడు. "నాహృదయము, మనస్సు, ఆత్మ సంధ్యను పెళ్ళాడటంలో దోషమేమీ లేదని నాకు చెబుతున్నాయి. నిజంగా దోషమే అయితే - స్వామీ! ఆగ్రహించకండి - అటువంటి భావం నాకు కలగకుండానే ఉండవలసింది. కలిగినా నా ఇంద్రియాలు, సహజమైన తమతమ వ్యాపారాలు నిర్వహించకుండా ఉండవలసింది. కానీ అలా జరగలేదు. మనస్సు సంధ్యధ్యాసతో నిండిపోయింది. శరీరం, ఆమెతోడి కలయికకు ఉవ్విళ్ళూరూతలూగుతున్నది. ఆ"పాపపు విషయం" తలచుకొంటేనే, సర్వాంగాలు ఆనందంతో గిలగిలలాడుతాయి. అనూహ్యము, అప్రమేయము అయిన, ఏదో మాధుర్యరుచులు శరీరమంతటా విచ్చుకొంటాయి."

"అయినా సరే!" అన్నాడు ఉపగుప్తుడు చిరుకోపంతో, "పాపం పాపమే అవుతుంది గానీ, పుణ్యం కాదు."

"కావచ్చు. అలాంటి అచింత్యానందం, పాపకార్యాలనుండే ప్రభవించే పక్షంలో, నన్ను వాటినే చేయనివ్వండి. దానికి విరుద్ధమైన - మీ భాషలో - పుణ్యకార్యాలు నే నాచరించను. అందుకు నేను అనర్హుణ్ణి" అన్నాడు రాహులుడు. అదీగాక, తల్లిగారీ వివాహానికి సమ్మతించారు. జీవికి ప్రధాన పూజనీయం తల్లిగానీ,

తండ్రికాడు కదా! అమ్మగారి ఆశీర్వాదబలం నాకున్నది. అంటే ప్రత్యక్ష దైవతాల్లో ప్రథమ మూర్తియైనవారు అంగీకరించారు. కడమవారి విషయం-ప్రశాంతంగా ఆలోచించవచ్చు... ఏమిటి స్వామీ! మీరేదో దీర్ఘంగా యోచిస్తున్నారు? మీ మనస్సును నొప్పించలేదు గదా!"

ఉపగుప్తుడు దీర్ఘంగా నిట్టూర్చాడు.

"వత్సా! నీ ప్రశ్నలకు నేను ప్రత్యుత్తరాలివ్వలేను. ఇచ్చినా అవి నిన్ను సంతృప్తిపరచలేవు. నిజంగా-నాయనా! నువ్వను కొంటున్న సుఖసౌఖ్యాలందులో లేవు. ఉన్నాయని నీకల్మషాత్మ నిన్ను భ్రమపెడుతున్నది. అప్రమేయానంద మంటూ నువ్వంటున్నది: వాస్తవానికి-ఆనందమే కాదు. ఇంద్రియాలుపొందే ఒకరకపు సంచలన మది. మామూలుకన్న భిన్నమార్గంలో అవి సంవేదించడంవల్ల, నువ్వొక నూతనానుభూతిని పొందుతున్నావు. దానికి ఆనందమనే పేరు పెట్టుకున్నావు నిజమైన ఆనందం-ఎలాంటిదో, దాని అనుపాను లేమిటో నీకు వీసమంతయినా తెలియదు. ఏవో క్షుద్ర సుఖాలను పట్టుకుని - కుప్పిగంతులు వేయటం మాత్రమే నీకు తెలుసు..."

"ఆగండి" అన్నాడు రాహులుడు చిరునవ్వు నవ్వుతూ. "మీమాట ప్రకారం-ఇవి క్షుద్రసుఖాలే ననుకొందాం. అయితే, ఇవి సంధ్యావివాహంవరకే పరిమితం కావుగదా! సంధ్యనుకాక వేరొక స్త్రీని వివాహమాడినా, నేను అనుభవించేది, మీ రసహ్యించుకొంటున్న ఈ క్షుద్రసుఖాలే కదా! ఒక స్త్రీతోడి కూటమి క్షుద్ర

మయి, మరొక వన్నెలాడి పొందు ఉన్నతమవుతుందా? అవుతుందనడం ధర్మ సమ్మతమా! మీమాటలబట్టి చూస్తే అసలు వివాహమే పాపకార్యం కావాలి. అవునా? కాక సంధ్యతోడి వివాహంమాత్రమే పాపమని మీరంటే, మీ నిర్ణయాన్ని-మీరు తపస్సంపన్నులు, పూజ్యులు కావచ్చు-నే నేమాత్రం గౌరవించ లేను!"

ఉపగుప్తుని క్రోధం పరాకోటి నందుకొన్నది. "మూర్ఖుడా!" అన్నాడు ఉపగుప్తుడు చివాలున లేచి "ఎంత చెప్పినా నీ కువాదం విడిచిపెట్టకుండా ఉన్నావు. మదోన్మత్తతతో పిన్న పెద్ద తారతమ్యాన్నిగూడా కానడంలేదు. జీవిత ధ్యేయమంటూ నీవు చెప్పే ఆనందాలు, మధురానుభూతులు, ఎంతటి హేయమైనవో, వాటినే పట్టుకు ప్రాకులాడే ఈమానవులు ఎంతటి నీచులో నీకు నీవే తెలిసికొన్న నాడుగానీ, నా మాటలలోని సత్యం బోధపడదు."

రాహులుడు మాట్లాడలేదు. తలవంచుకొని అలాగే నిలుచున్నాడు. అప్రయత్నంగా అతని కన్నులు బాష్పపూరితా లయినాయి. ఉపగుప్తుడు-తపస్వి గనుక - రాహులుని మనోవేదన గుర్తించాడు. కోపం దిగజారిపోయింది. ఆప్యాయంగా రాహులుని ఆలింగనంచేసుకొన్నాడు.

"స్వామీ! మీ రేమయినా అనండి. సంధ్యను విడిచి నేను బ్రతుకలేను. ఆమెనుండి నేను పొందుతున్నది సౌఖ్యం కాదనలేను. కాదనటానికి నా అంతరాత్మ అంగీకరించటం లేదు... మీరు సరే-తండ్రిగారు నన్నెందుకీ పెండ్లి మానుకొమ్మంటున్నారు? మీరు చెప్పే పాపకారణం కాదుగదా?

విషయ మేమిటో తెలిసికోనకుండా—నిష్కారణంగా, సంధ్యను విసర్జించటం నేను చేయలేని పని" అన్నాడు రాహులుడు.

"అవును. నిజమే! తారుణ్య హృదయం, కార్య కారణ సంబంధాన్ని వాంఛిస్తుంది." అన్నాడు. ఉపగుప్తుడు కొన్ని క్షణాలు మౌనంవహించి "నాయనా! చిరకాలం తపస్సుచేసి నేను రెండు శక్తులు సంపాదించాను. వాత్స ల్యంకొద్దీ వాటిని నీకు ధారాదత్తం చేస్తున్నాను. ఒకటి: కావాలనుకొన్నపుడు నీవు అదృశ్యం కావచ్చు. రెండు: ఎవరి హృదయంలో ఏమున్నదో తెలుకోవచ్చు. కొంత కాలంపాటు ఈ శక్తిద్వయాన్ని వుపయోగించుకొని,ఆ తరు వాత నాకు కనిపించు. సత్యాసత్యాలేమిటో అప్పుడు నీకు బోధపడతాయి."

"ధన్యుణ్ని!" అన్నాడు రాహులుడు.

## 7

అదృశ్య రూపంతో రాహులుడు అనేకచోట్ల సంచ రించాడు. ఎన్నో సంఘటనలు చూచాడు. కొన్ని అతనికి అసహ్యం కలిగించాయి. మరికొన్ని కంపరం పుట్టించాయి. ఇంకొన్నింటిని చూచి నవ్వుకొన్నాడు. అదృశ్య రూపంతో తల్లినిదర్శించాలనుకొని, సుపర్ణాదేవి భవనం ప్రవేశించాడు. తల్లి ఆసీనురాలై వున్నది. దాసీజనం తల్లిని అనేక విధాల బ్రతిమలాడుతున్నారు. ఐనా మహారాణి భోజనంచేయ

నంటున్నది. తన మనస్సేమీ బాగులేదంటున్నది. నన్ను విసిగించవద్దంటున్నది. దీనికంతా కారణం తనే నను కొన్నాడు రాహులుడు. తన మూలంగానే తల్లి అన్న పానీయాలు వర్జించింది. కొడుకయి- తల్లికి తను చేస్తున్న సేవ ఇదా? రాహులుని హృదయం కలుక్కుమన్నది. మూర్తీభవించిన శోకరాశిలా వున్న తల్లిని చూడలేక బయటికొచ్చాడు.

దూరంగా ప్రభువువారి యేకాంత మందిరం. అందులో ఆంతరంగికామాత్యుడు, జయభద్రుడు మాట్లాడుకొంటున్నారు. కుతూహలంతో రాహులుడు ఆభవనంలో ప్రవేశించాడు. తండ్రి అంతరంగిక మంత్రిని సలహాలడుగుతున్నాడు. అతను చెబుతున్నాడు.

"అందువల్ల చిక్కులేమీ వుండవుగదా?" అన్నాడు జయభద్రుడు.

"లేదు ప్రభూ! విశ్వాసపాత్రులయిన రాజభటులను ఈ పనికై నియోగిస్తాను. పెరవారికి తెలియకుండా, శివశర్మ కుటుంబాన్ని సరిహద్దులను దాటించవచ్చు." అన్నాడాయన.

"మంచిది. మీ రా ప్రయత్నంలో వుండండి. దీనివల్లనయినా రాహులుని మనస్సు మారవచ్చు." అన్నాడు జయభద్రుడు. "అమాత్యా! రాహులుని పట్టుదల చూస్తుంటే నాకు నవ్వువస్తున్నది. మూడు నెలలు... దాదాపు మూడు నెలలు కావస్తున్నది. నేను చిరంజీవిని చూసి. అతన్ని చూడాలని, మనస్సు ఆరాటపడుతోంది.

దానిని అణచటం నాశక్తికిమించినపని. ఎప్పుడే అపాయం మూడుతుందోనని, వేగులను నియమించాను. ఒక్క పుత్రుడు... ఇద్దరికీ వైరం."

మహాప్రభువు కొనగోటితో, కన్నీటిని తుడుచుకొన్నాడు.

రాహులుని హృదయం కరిగిపోయింది. తండ్రి, నిజస్వరూపం ఇప్పుడు గోచరించింది. తనపై ఇంతటి ప్రేమానురాగాలుగల తండ్రి, తన వివాహాన్ని ఎందుకు కాదంటున్నాడు? సంధ్యపై వారి కింత ద్వేషమెందుకు?

సంధ్య స్మృతికిరాగానే రాహులు డక్కడ నిలువలేకపోయాడు. పురుషుడు—తనే ఇంత కకావికలౌతున్నాడు, ఇక సంధ్య ఎలా ఉన్నదో? రాజభటుల ఆటంకాల వల్ల తను తరచుగా సంధ్యను కలుసుకొనలేకపోతున్నాడు. వెళ్ళి చూడాలి ...అతను అనుమానించిన దంతా నిజమయింది. సంధ్య వ్యాధిపీడితలా కుసుకుసులాడుతున్నది, కళ్ళు గుంటలు పడ్డాయి. చెక్కిళ్ళు చిక్కిపోయాయి. మైమరచి నిద్రపోతున్నది. అలవాటుకొద్దీ చుట్టూ చూసి-అంతలో నవ్వుకొన్నాడు. సమీపించి మెల్లిగా ఆమెను ముద్దుపెట్టుకొన్నాడు. నుదుటిమీద వెంట్రుకలు చక్కదిద్దాడు.

సంతోషంతో ఒప్పుకొన్న గురువుగారినీ, సుతరామూ అంగీకరించని గురుపత్నినీ చూడాలనుకొన్నాడు. గురుపత్ని భీభత్సంగా కనుపించింది. గురువుగారు ఏవో గ్రంథాలు తిరుగవేస్తున్నాడు. విద్యార్థు లెవ్వరూ లేరు.

ఇల్లు — మానవులుంటున్నదానిలా లేదు. నీరవంగా, భయావహంగా ఉన్నది. ఇక్కడైనా వీరు ఎక్కువ కాలం ఉండకపోవచ్చు. సాధ్యమైనంత తొందరలో వీరు దేశ బహిష్కారం కావలసివస్తుంది. వీరితోబాటే తను - సంధ్య కూడా తనకు కనిపించదు. అప్పుడు తను చేయగలిగిందల్లా- ఒక్క విచారపడటం మాత్రమే!

*　　*　　*

రెండువిద్యలూ ఒకేసారి ఉపయోగించుకోనడానికి వీలులేని కారణాన, ముందు అదృశ్యరూపసంబంధవిద్యనే తలచుకొన్నాడు. ఎన్నో భయంకరదృశ్యాలు చూశాడు. పైకి స్వచ్ఛంగా, శాంతంగా, నిర్మలంగా కనిపించేవారు- రహస్యంగా, ఎంతనీచంగా ప్రవర్తిస్తారో రాహులుడు అర్థంచేసుకొన్నాడు. పైకి కాఠిన్యమూర్తులుగా కనిపించే వారిలోని కారుణ్యాన్ని గమనించాడు. హృదయవిదారకాలైన దృశ్యాలు, మానవుడు చేయగలడని నమ్మలేని అకృత్యాలు, తన కళ్ళారా చూశాడు. చాలు. ఈ విద్య అవసరం-దాదాపు ముగిసిందనుకోవచ్చు.

పోతే రెండవది. దీనివల్ల ఇంకెన్ని చిత్రాలు బైట పడతాయో? మొదటివిద్యవల్ల మాటకూ-చేతకూగల భేదం తెలిసిపోయింది. ఈ రెండవదానివల్ల మాటకూ మనస్సుకూ గల భేదం తెలుస్తుంది. ఇబ్బందిలేదు. తనెక్కడికూ వెళ్ళ నవసరంలేకుండా-సుఖంగా ఉన్నచోటనే వుండి, కావలసిన వారి ఆంతర్యంలోని ఆలోచనలను గ్రహించవచ్చు.

ఇప్పుడు రాత్రి చాలా ప్రొద్దుపోయిందిగదా! తననుగురించి సంధ్య ఏమనుకొంటున్నదో?

[సంధ్య స్వగతం]

ఆశలన్నీ అడుగంటుతున్నాయి. చిత్రహింసలు పడటానికైనా ఒప్పుకుంటుందిగానీ, రాహులునితో పెండ్లిని అమ్మ ఒప్పుకోవటంలేదు. ఎందుకో తెలీదు. అమ్మ కారణం చెప్పదు. ఒద్దనిమాత్రమే అంటుంది.... మహాప్రభువు కట్టుదిట్టాలు అధికంచేయడంతో, రాహులుడు రావడంకూడా మందగించింది. తనను మరిచిపోతాడా ? పిచ్చిఊహ. మరిచిపోయేవాడయితే, పరిస్థితు లింతదాకా వచ్చేవికావు. రాహుల్! అమాయికుడైన తన రాహుల్, తనకోసం తండ్రితోనే విరోధం పెట్టుకున్నాడు. యుద్ధానికికాలుదువ్వాడు... ఎంత చక్కగా నవ్వేవాడు! ఆ బలమైన హస్తాలతో కౌగలించి నలిపివేసేవాడు. తెల్లవారుతుందన్నా, ఆలింగన్నాన్నొదలక 'నిన్ను వదలలే' ననేవాడు. ముఖాన్ని ముద్దులతో నింపివేసేవాడు. ఒక్కఘడియ తనను చూడకుండా వుండలేననేవాడు. ఏదో ఒకవంకతో తనను ముట్టుకోవాలని ఆరాటపడిపోయేవాడు. అతనికౌగిలిలో వుంటే ఈ విశ్వాన్నే జయించవచ్చునిపించేది. ఇప్పుడేంచేస్తుంటాడో ?... తనను గురించే ఆలోచిస్తుంటాడా?

* * *

"అవునుసంధ్యా! నువ్వనుకొంటున్నది నిజమే! నేను నిన్నుగురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు రాహులుడు.

తిరిగీ సంధ్యను భావించాడు. ఆమె వెన్నెలనుగురించి ఆలోచిస్తున్నది. చందమామలో ఆ మచ్చ లెందుకున్నాయో ననుకొంటున్నది. పోనిమ్మనుకొన్నాడు రాహులుడు. మనస్సును శివశర్మపై లగ్నంచేశాడు. అతని దుష్టపుటాలోచనలన్నీ అవగతమైనాయి. రాహులుడు బ్రాన్పడిపోయాడు. గురుదేవునిలో ఇంతటి పైశాచికత వుంటుందని, ఇప్పటికీ నమ్మలేకపోతున్నాడు. సంతోషంతో ఒప్పుకోవడంచూచి గురువుగారి సంస్కారహృదయానికి నమస్సులర్పించాడు! కానీ అంగీకరించడమనేది - ఇందుకోసమని ఇప్పటిదాకా తనకు తెలియదు. నీచుడా ... రాహులుడు ఛీత్కరించుకొన్నాడు. చిరునవ్వుతో గురుపాదులు కనిపించారు. ఆ సుందరాకారంలో, ఇలాంటి హేయభావాలు ఎలా ఉండగలిగాయా అని ఆశ్చర్యపోయాడు. సరే! శివశర్మ అంగీకారానికి కారణాలు కనిపిస్తున్నాయి.మరి గురుపత్ని నిరాకరించటమెందుకు? రాహులుడు గురుపత్నిని భావించాడు. కొన్నిక్షణాలపాటు శుక్తిమతి ఆలోచనాక్రమం అర్థం కాలేదు. ఏమిటో గజిబిజిగా ఉన్నది. ఒక దానికీ మరొక దానికీ సంబంధములేదు. అంతా అయోమయం....

* * *

[శుక్తిమతి స్వగతం]

చాలా ప్రొద్దుపోయింది .... అబ్బ చలి ! నరాలు కొరుక్కుతింటున్నది .... విద్యార్థులంతా వెళ్ళిపొయ్యారు.

అందరిలోకీ ఆనందగుప్తుడు ఎంతమంచివాడు. దివా రాత్రాలు అలా పుస్తకాలు ముందు వేసుకుకూర్చునే వాడు... మంచుకూడా కురుస్తున్న దే!... నీడ ఇంకా తలుపు దగ్గరకు రాలేదు .. భగవంతు డీ చలిని ఎందుకు సృష్టించి నట్లు?... ఏనుగుశరీరానికి ఆవుతలఅతికి తే ఎలావుంటుంది?... బాగానే వుంటుంది, తమ దాంపత్యంలాగా ... వారింకా నిద్రపోలేదా? ఎందుకో ఆ చదువు?.... పశువు ... దయా దాక్షిణ్యాలు లేవు... రాక్షసు డే నయం .... ఇదివరకు అలా కాదు. ఎంత ప్రేమగా చూసేవాడు! "నీవల్లనే నాకు కలిసి వచ్చిందే" అని అనేకసారులన్నాడు. నిజమే! తన వివా హానికిముందు గర్భదరిద్రులు. మహా పండితుడే మరి ! ఆద రించేదెవ్వరు? వీరిపాండిత్యం ఎవరికికావాలి? సిరి సంపదలను బట్టిగాక, విద్యలనుచూసి తన తండ్రి వీరిని అల్లునిగా చేసు కొన్నారు... ఎన్ని బాధలు! ఎంత భయంకరమైన దరిద్రం! ఎన్నిపస్తులు! ఎన్ని అవస్థలు!... తలుచుకొంటుంటే ఇప్ప కీటి ప్రాణం గడగడలాడిపోతుంది. ఊరువిడిచి ఊరు, పట్టణంవిడిచి పట్టణం, దేశంవిడిచి దేశం; కొన్నిసంవత్సరా లిలా తిరగడంలోనే జరిగిపోయాయి. చివరకు-ఇక్కడకు రావడమూ.... నిద్రపోయారేమో ... దీపంలేదే ! పోనే ఉంటారు.... అబ్బా! నీడకూడా చాలా పైకివచ్చిందే !... ఈ ఎలుకలతో వేగడం కష్టంగావుంది. పిల్లిని పెంచకూడ దుట... అన్నీ నిష్టలు.... మంచు ఇంకా పడుతూనేవుంది. పాపం! ఆవు ఎంత బాధపడుతున్నదో! .... అమ్మయ్యో! గుండె ఝల్లుమన్నది. మనిషేమోనన్న అనుమానం

వేసింది .... తలుపుకు గడియబెట్టాలి ... చంద్రుడుకూడా కప్పబడిపోయాడు. ఎంత మంచుకురుస్తున్నదో .... చిన్న తనంలో మంచులో తిరగడమంటే....సంధ్య ఇంకా నిద్ర పోదేం?... చలిగాడుపు చర్మాన్ని కోస్తున్నది ... దూర్వా దుస్స్వప్న నాశనీ....

*　　　*　　　*

ఇలా ఉన్నాయి ఆలోచనలు. ఎంతోసేపు నిరీక్షించాడు. తనకు కావలసింది లభించలేదు,రవంత విసుగెత్తింది. పోనీ మరొకసారి ప్రయత్నించి చూడామనుకొన్నాడు. పోతే ఇక మిగిలివున్నది తన తల్లిదండ్రులు.తల్లి ఏమనుకొంటున్నదీ తెలియలేదు. ఆమెలో ఏ ఆలోచనలూ లేవేమోననుకొన్నాడు. అన్నపానాదులు ముట్టని కారణాన, స్పృహ లేకుండా నిద్రిస్తున్నదని సరిపెట్టుకున్నాడు. తండ్రిదగ్గర కొచ్చేసరికి మనస్సు జివ్వుమన్నది. ఏవో మధురమైన తలపులే తలపోస్తున్నాడు. "రాజ్యానికొచ్చినకొత్తలో" అనుకొంటున్నాడు తండ్రి. ఆఁ, కొత్తలో? కొత్తలో ఏమి జరిగిందో తెలుసుకోవాలన్న కుతూహలం రాహులునిలో పెచ్చరిల్లింది.

*　　　*　　　*

[జయభద్రుని స్వగతం]

అదేదో పర్వదినం. తనకు స్పష్టంగా జ్ఞాపకంలేదు. మహారాణి పదివేలమంది బ్రాహ్మణదంపతులకు స్వర్ణదాన

మివ్వాలని అన్నది. తను అంగీకరించాడు. పట్టణంలోని బ్రాహ్మణదంపతులందరూ ఆహ్వానింపబడ్డారు. ప్రాతః కాలాన ప్రారంభమయి, సాయంత్రంవరకూ సాగిన ఆ సువర్ణదానోత్సవం—ఇప్పటికీ తనకు కళ్ళకు కట్టినట్లుగా వున్నది. అప్పుడే తను ఆమెను చూశాడు. రత్నం రత్నమే! గాజుపెంకు గాజుపెంకే! ఉజ్వలమైన సౌందర్యంతో భాసించే ఆమె రూపం, అప్పుడే తనను ఆకర్షించింది. ఆ సౌంద ర్యాన్ని అనుభవించకుండా వుండడం అసంభవమనిపిం చింది. భటునిచేత ఉండమని వారికి కబురుచేశాడు. వారి దీ ఊరు కాదట! పొట్టచేతపట్టుకొని అలా బయలుదేరా రట... తనకు బాగా జ్ఞాపకమున్నది. ఆనాడు పున్నమి. వెండివెన్నెలలు లోకమంతా నిండిపోయాయి. కానీ తను మాత్రం ఏదో నెపంపెట్టే కావచ్చు ... ఆమెను తన రహస్యమందిరంలోకి పిలిపించాడు. అనుమానిస్తూనే వచ్చింది. పిలిపించినకారణంఅర్థమైనదానిలాబెదిరిపోసాగింది. వెళ్ళడానికి ప్రయత్నించింది. తను ఆమె ప్రయత్నాలన్నిం టినీ అడ్డుకొన్నాడు.

"పిచ్చిదానా! నేను మహారాజును. నువ్వొక బికా రివి. తప్పుకెళ్ళాలని ప్రయత్నించకు. అయినా తప్పుకొని ఎక్కడకు వెడతావు? నీకు తెలియదేమో ఇది రాజ మందిరం! చుట్టూ విచ్చుకత్తులతో రాజభటులున్నారు. చిన్న సైగతో నిన్నేమయినా చేయగలరు. పెనగులాడకు. అరవకు. నీకేమికావాలో కోరుకో. భూములా? సౌధాలా? ధాన్య సంపదలా? రతనాలరాసులా? ఉన్నతోద్యో

గాలా ? నీ కేమికావాలన్నా యిస్తాను. చెప్పు. ఏమి కావాలి?"

"ఏమీవద్దు. నన్ను పోనివ్వండి" అన్నదామె.

"అదితప్పు" అన్నాడు తాను. "ఎక్కడికి వెడతావు? వెళ్ళి నీ వనుభవించేదేమిటి! ఆ భయంకరదరిద్రమేనా ? మూర్ఖురాలా! అమూల్యమైన నీ యౌవనం, సౌందర్యం, మోహకాంతితో పింపెసలారే ఈ శరీరాన్ని ఎందుకు వ్యర్థపరుస్తావు? ఎందుకు అయోగ్యుని కిస్తావు? కనీసం వీటిని సార్థకంచేసుకొందామన్న ఆలోచనే నీకు లేదా?"

మనస్సులో ఏమనుకొన్నదోగానీ, పైకిమాత్ర మేమీ మాట్లాడలేదు. తను సమీపించాడు. ఆమె అభ్యంతరం చెప్పలేదు...

అంతే! ఆనాటినుండీ తమ పరిచయం-క్షణక్షణాభి వృద్ధినందింది. ఒకరినివిడిచి మరొకరు ఉండలేనిస్థితివచ్చింది. అలాగే ఈనాటికీ వున్నారు. నామకః మాత్రమే శివశర్మ భర్త. శుక్తిమతి సౌందర్యము, యౌవనము సంపూర్ణంగా తనే అనుభవించాడు. తమ అనుభవఫలితం సంధ్యగా రూపొందింది... ఈ విషయాలన్నీ రాహులుని కెట్లా తెలియ చేయడం? వాడు నన్ను చూచి....

* * *

అప్పటికే రాహులుడు వెర్రెత్తిపోయాడు. ఛరా లున లేచాడు. కుప్పలా కూలబడిపోయాడు. ఊపిరి తిరగటం లేదు. రక్తం ఎవరో తోడివేస్తున్నట్లు విలవిలలాడాడు.

భయంకరమైన చీకట్లు నలుదిక్కులా క్రమ్ముకొస్తున్నాయి. లక్షలాది పిడుగులు మనస్సులో పేలుతున్నాయి. చేదు గాడ్పులు నాళనాళంలోనూ పొగలు రేపుతున్నాయి.

## 8

రాహులుని కీ ప్రపంచమంతా హేయంగా గోచరించింది. ఏది నీతో, ఏది అవినీతో తెలియదు. ఏదిధర్మమో ఏదిఅధర్మమోబోధపడదు. బాహ్యస్వరూపం వేరు. అంతస్స్వరూపం వేరు. అవినాభావసంబంధము ఉండవలసిన ఈ రెండింటికీ పోలికలే లేవు. అనుకొన్నది ఒకటి, అన్నది వేరొకటి. మాట న్యాయబద్ధం. చేత నీచాతినీచం....

తను చేసిందేమిటి? దీనికి పరిహారమేమిటి?... సోదరితోనా, తను... చేసింది! తనవంటి నీచు డెక్కడైనా ఉంటాడా? ఏ అగ్ని ఈ కల్మషాన్ని తుడిచివేస్తుంది? మానవు డింత పశుప్రాయు డెందుకవుతున్నాడు?

రాహులునికి సమాధానం చిక్కలేదు. దశదిశలూ పరికించాడు. కళ్ళు మూసుకున్నాడు. ఒకనాటి తన వాదనలన్నీ జ్ఞప్తికొచ్చాయి. శరీరం గండరించింది. మనస్సు వ్రయలువ్రయ్యలైంది. తండ్రి వ్యతిరేకించినకారణమేమిటో ఇప్పుడు స్పష్టమైంది. ఇక తాను సంధ్యను వివాహమాడగలడా? ఆమెను స్పృశించగలడా? తన వాదనలన్నీ కలిసినా ఆమెను తాకలేదు, కనీసం చూడనుగూడా చూడలేదు.

ఆమెనేకాదు; ఇంకే స్త్రీని తను కన్నెత్తి చూడలేదు. ఎవరితండ్రి ఎవరో, ఎవరితల్లి ఎవరో, ఎవరికి ఎవరు ఏమవుతారో ఎలా చెప్పడం ? ఈ బాహిరసంబంధాలను ఎలా విశ్వసించడం ? ఈ కల్పిత పొరలను ఛేధించి, అంతరాళంలోకి చూస్తే, ఎంతటి భయంకరమైన సత్యం గోచరిస్తుంది? మానవు లింతటి అధోగతిలో ఎందుకు జీవిస్తున్నారు? ఇంత దుర్గారులు, మోసగాళ్ళు, ఆత్మవంచనాపరులుగా, వారి నే యే పరిస్థితులు మార్చాయి? మానవుల ఈ ద్వివిధజీవితాలలో ఏది యథార్థం ? ఏది అయథార్థం ? తను దేనిని విశ్వసించాలి? దేనిని గర్హించాలి?... ఒకవేళ— తను లోపాలనుకొంటున్నవన్నీ ఉండడమే మానవత్వమేమో! ఈ సత్యం తెలుసుకొనడానికే ఉపగుప్తుడు తన కా దివ్యశక్తులు ప్రసాదించాడేమో?

ప్రత్యుత్తరంకోసం - భీషణాతపజ్వాలలను వెలిగ్రక్కుతున్న హృదయంతో, రాహులుడు అప్పుడే ఉపగుప్త నివాసారణ్యంవైపు సాగాడు.